క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: మెరుగైన విద్యుత్ సరఫరాను కొనసాగించేందుకు చేపట్టాల్సిన మరమ్మతుల కోసం మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ గోవిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ పట్టణంలోని 132/33 కేడీ సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే తొత్తినోనిదొడ్డి 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. దాని వల్ల మండలంలోని ఉత్తనూరు, భూంపురం, ఈడుగోనిపల్లి, సంకాపురం, చిన్న తాండ్రపాడు, కేశవరం, వేణిసోంపురం, మేడికొండ, తుపత్రాల, తొత్తినోనిదొడ్డి, పులికల్, బైనిపల్లి, సింధనూరు, కిసాన్ నగర్, రాజాపురం, మూగోనిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. గట్టు మండలంలోని ఇందువాసి, బోయలగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో మూడు గంటలపాటు అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని కోరారు.

ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలి

మానవపాడు: మానవపాడు ప్రాజెక్ట్ పరిధిలోని ఉండవెల్లి, ఇటిక్యాల, మానవపాడు మండలాల అంగన్‌వాడీ టీచర్లకు సోమవారం ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ సెంటర్లలోని చిన్నారులకు ఎత్తుకు తగ్గ బరువు ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ధర్మసంస్థాపనే భగవద్గీత సారాంశం



శాంతినగర్: త్రైత సిద్ధాంత భగవద్గీత సారాంశమంతా ధర్మముల స్థాపనే అని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బింగిదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా భగవద్గీత పుస్తకాలను ప్రజలకు విక్రయిస్తూ భగవద్గీతలోని శ్లోకాలకు సంబంధించిన సారాంశం బోధించారు. కార్యక్రమంలో సభ్యులు ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, సరసమ్మ, పద్మమ్మ, జమ్ములమ్మ పాల్గొన్నారు.

ఫీజులు నియంత్రించాలి

గట్టు: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల కన్వీనర్ బల్గెర మోజేష్ డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ లేకుండా పోయిందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

జైన మతస్తుల పాదయాత్ర

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామంలోని మహవీర్ జైన్ ఆలయాన్ని జైన మహరాజులైన ఆచార్య అంతర్మన ప్రసన్నసాగర్‌జీ మహారాజ్ బెంగుళూర్ నుంచి హైదరాబాద్ వయా మేడ్చల్ జిల్లాకు పాదయాత్రగా పయనిస్తున్నారు. దేశం సుభిక్షంగా ఉండేందుకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. 20 రోజులుగా బెంగుళూర్ నుంచి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు పాదయాత్రగా వచ్చినట్లు తెలిపారు. వారి వెంట శిష్య బృందం 5 మంది ఉన్నారు. వారు 15 రోజుల్లో మేడ్చల్లోని జైన మందిరానికి, చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో జయంతి లాల్, తదితర్లు పాల్గొన్నారు.

పతాక స్థాయిలో దేశాభివృద్ధి

రాజోళి: దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలో రావడంతో దేశాభివృద్ధి శరవేగంగా పరుగులు పెడుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ ప్రజలు ఇండియా కూటమిని విశ్వసించలేదని, మోదీపై అపారమైన నమ్మకాన్ని పెంచుకున్నారన్నారు. ప్రధాని ప్రజల నమ్మకాలను వమ్ము చేయకుండా దేశంలో ఇప్పటి నుంచి పథకాల పంట, అభివృద్ధి బాట మరింత వేగం పుంజుకుంటుందని తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా పెరిగిన కంప చెట్లు

రాజోళి: రోడ్డుకు అడ్డంగా కంప చెట్లు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తుమ్మిళ్ల నుంచి పచ్చర్లకు వెళ్లే దారిలో వేసిన స్కీం రోడ్డు గుండా ముళ్ల కంపలు పెరిగాయి. ఈ రోడ్డులో తుమ్మిళ్ల, పచ్చర్ల, తనగల, పెద్ద తాండ్రపాడు, అశోక్‌నగర్ గ్రామాల వాహనదారులు నిత్యం రాకపోకలు చేస్తుంటారు. ఈ దారిపై కనీస పర్యవేక్షణ లేకపోవడం వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

రాకపోకలు సాగించేదెలా?

- పిల్లిగుండ్ల కాలనీకి దారిలేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



పిల్లిగుండ్ల కాలనీకి వెళ్లే దారిలో రాయచూరు రైల్వేలైన్ బ్రిడ్జి కింద నిలిచిన వర్షపునీరు



పిల్లిగుండ్ల కాలనీకి వెళ్లే దారిలో కంకరతో కూడిన రింగ్ రోడ్డు



రాయచూర్ రైల్వే లైన్ వద్ద కొనసాగుతున్న అండర్ బ్రిడ్జి పనులు

గద్వాల అర్బన్: గద్వాల పట్టణంలోని పిల్లిగుండ్ల కాలనీకి రాకపోకలు సాగించేందుకు సరైన రోడ్డు లేదు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక రాత్రిపూట రాకపోకలు సాగించాలంటే నరయాతనేనని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ రోడ్డులో కనీసం విద్యుత్ లైట్లు లేకపోవడంతో మరింత అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ పట్టించుకునే నాథుడు కరువయ్యారు.

ప్రమాదకరంగా ప్రయాణం

పిల్లిగుండ్ల కాలనీలో దాదాపు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వివిధ పనులు చేస్తూ జీవనం సాగించే పేద కుటుంబాలు అధికంగా ఉన్నాయి. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో పనులకు వెళ్తూ వస్తుంటారు. ప్రతిరోజు వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. పిల్లిగుండ్ల కాలనీ, మేలచేర్వు గ్రామానికి రాకపోకలు సాగించేందుకు ప్రధాన రహదారి ఉండేది. ఈ దారిలో గద్వాల–రాయచూర్, గద్వాల–కర్నూల్ రైల్వే లైన్ వద్ద అండర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతాన్ని మూసేశారు. ఈ కాలనీకి రాకపోకలు సాగించేందుకు ప్రైవేటు ప్లాట్లలో నుంచి రాయచూర్ లైన్ చిన్న పాటి బ్రిడ్జి కింద నుంచి ద్విచక్ర వాహనాలపై వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. జమ్మిచేడు, మేలచెర్వుకు వెళ్లాలంటే కర్నూల్ రైల్వే బ్రిడ్జి కింద నుంచి ఇదే తరహాలో ప్రయాణించాలి. ఒక వాహనం వెళ్లిందంటే మరొకరు ఆగాల్సిందే.

వర్షాలతో రాకపోకలకు ఇబ్బంది..

రైల్వేలైన్ వద్ద అండర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. పిల్లిగుండ్ల కాలనీకి వెళ్లేందుకు రాయచూర్ రైల్వేలైన్ బ్రిడ్జి కింద నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో ఈ బ్రిడ్జి కింద పెద్ద ఎత్తున్న వర్షపు నీరు నిల్వ ఉండి బురదమయంగా మారింది. దీంతో రాకపోకలకు మరింత ఇబ్బందిగా మారింది. ఇక రాత్రి పూట విద్యుత్ దీపాలు లేకపోవడంతో చిమ్మ చీకటిలో వర్షపు నీరు కనిపించకపోవడం, పైగా బురద ఉండడం, రైల్వే బ్రిడ్జి కింద ప్రయాణం సాగించాలంటే ఆందోళన చెందుతున్నారు.

రింగ్ రోడ్డున వెళ్లాలంటే కంకర దారి..

పట్టణ శివారులోని అయిజ రోడ్డు నుంచి పిల్లిగుండ్ల కాలనీ మీదుగా రింగురోడ్డు వేశారు. పిల్లిగుండ్ల కాలనీకి రింగ్ రోడ్డు మీదుగా ప్రయాణం సాగిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కేవలం కంకర, డస్టు వేసి వదిలేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకర దారి ఉండటంతో అదుపుతప్పి కిందపడుతున్నారు. ఈ రోడ్డులో విద్యుత్ దీపాలు సైతం లేకపోవడంతో రాత్రి సమయాల్లో కంకర దారిలో ప్రయాణాలు కత్తి మీద సాముగా మారింది. అండర్‌బ్రిడ్జి పనులు ఒకవైపు, రింగురోడ్డుపై కంకర దారి ఉండటంతో కాలనీవాసులు నిత్యం నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు సరైన రోడ్డు మార్గం కల్పించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటికి వెళ్లేందుకు అవస్థలు



పిల్లిగుండ్ల కాలనీకి రాకపోకలకు రోడ్డు సమస్య తీవ్రంగా ఉంది. ఇంటికి వెళ్లాలంటే అయిజ రోడ్డులోని రింగ్ రోడ్డు మీదుగా వెళ్లాలి. ఈ కంకర రోడ్డుతో వాహనాలు అదుపు తప్పి కింద పడుతున్నాం. అదేవిధంగా రింగ్ రోడ్డు నుంచి పిల్లిగుండ్ల కాలనీకి వెళ్లే దారిలో రాత్రి పూట విద్యుత్ లైట్లు లేకపోవడం, కంకర దారి ఉండడంతో ఇంటికి వెళ్లాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నాం.

– మహిబూబ్, పిల్లిగుండ్ల కాలనీ

రోడ్డు సమస్య పరిష్కరించాలి



అయిజ రోడ్డు గుంతలమయంగా మారింది. మా కాలనీకి వెళ్లాలంటే రాయచూర్ రైల్వేలైన్ చిన్నపాటి బ్రిడ్జి కింద నుంచి ప్రయాణించాల్సి వస్తోంది. వర్షాలు కురుస్తుండంతో ఈ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వ ఉంటోంది. ఈ ప్రాంతంలో రాత్రిపూట గుంపులుగా మద్యం తాగుతున్నారు. దీంతో అక్కడి నుంచి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లలేకపోతున్నాం. విద్యుత్ లైట్లు సైతం లేవు. రోడ్డు సమస్యను పరిష్కరించాలి.

– బుచ్చన్న, పిల్లిగుండ్ల కాలనీ

ప్రజలకు అండగా ఉంటాం



సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. అయిజ మండలం కుట్కనూర్ గ్రామానికి చెందిన భీమన్న ఆపరేషన్‌కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల కోసం రూ.2 లక్షల ఎల్‌ఓసీ వచ్చినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీని అందజేసినట్లు తెలిపారు. వారితోపాటు జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు గోపాల్, నాయకులు వెంకటేష్, ఎల్లప్ప, తిమ్మప్ప ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కర్నూల్ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే పరామర్శించారు. రాజోలి మండలం పచ్చర్ల గ్రామానికి చెందిన చెందిన మాబిరెడ్డి, మానవపాడు మండలం బోరవెల్లి గ్రామానికి చెందిన నరసింహ్మాజీ అనారోగ్యం వల్ల కర్నూల్‌లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే వారిని పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వారితోపాటు నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల యూనిఫాం అందజేత



కొత్తపాలెం తండాలో యూనిఫాంను అందజేస్తున్న ఐకేపీ సిబ్బంది



యూనిఫామ్స్ అందజేస్తున్న ఐకేపీ అధికారులు

ధరూరు: మండలంలోని ర్యాలంపాడు, కొత్తపాలెం తండా, మార్లబీడు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంను పంపిణీ చేశారు. సోమవారం ఐకేపీ సీసీలు జయరాజ్, నవీన్‌కుమార్‌లు పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. రేపటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతి పాఠశాలకు యూనిఫాంను అందజేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం లీడర్లు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గట్టు: సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన యూనిఫామ్స్‌ను సోమవారం ఐకేపీ అధికారులు ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లకు అందజేశారు. మండల మహిళా సమాఖ్య భవనంలో పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇప్పటి దాకా 20 పాఠశాలలకు సంబంధించిన యూనిఫామ్స్‌ను తయారు చేసి అందించినట్లు ఏపీఎం సాంబశివుడు తెలిపారు. మిగతా వాటిని త్వరలోనే అందజేయడం జరుగుతుందని ఏపీఎం తెలిపారు. కార్యక్రమంలో సీసీలు జయాకర్, జ్యోతి, ఆంజనేయులు, సుదర్శన్, రామకృష్ణ, ఆయా పాఠశాలలకు చెందిన హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

యూనిఫామ్స్ తయారీ కేంద్రం పరిశీలన

మండల కేంద్రంలో యూనిఫామ్స్ తయారీ కేంద్రాన్ని సోమవారం మాజీ సర్పంచ్ ధనలక్ష్మి పరిశీలించారు. మహిళా సమాఖ్యలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల కోసం యూనిఫామ్స్‌ను తయారు చేస్తున్నారు. ప్రభుత్వం యూనిఫాం తయారీలో మహిళా సంఘాల సభ్యులను భాగస్వాములను చేసినట్లు మాజీ సర్పంచు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివుడు, సీసీ జయాకర్, జ్యోతి పాల్గొన్నారు.

హామీల అమలుకు పోరాడాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి

గద్వాల అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం సీపీఎం కార్యకర్తలు పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ధరూరు, గద్వాల, ఇటిక్యాల మండలాల కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని తదితర హామీలను ఇచ్చిందని, ఈ హామీల అమలుకు సీపీఎం కార్యకర్తలు పోరాటాలకు రూపకల్పన చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఉప్పేరు నర్సింహ, నర్సింహ, రామకృష్ణ, కల్యాణ్, సురేష్, దేవదాసు, రామాంజనేయులు ఉన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



కేటీదొడ్డి: జూన్ 12న ప్రతి విద్యార్థికి పుస్తకాలు అందజేయాలని ఎంఈఓ సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు ఎంఈఓ సురేష్, జిల్లా సమన్వయ కర్త హంపయ్య అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వాతి, ఉపాధ్యాయులు గీతాంజలి, జయశ్రీ, శ్రీలక్ష్మి, సీఆర్‌పీ యుగంధర్, తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల దత్త కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ నిర్వాహకులు సోమవారం ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు కాలభైరవ పశుపత హోమాలు, రెండో రోజు కోటిలింగేశ్వరస్వామికి పుష్పాభిషేకం, బిల్వాభిషేకం, మూడో రోజు జ్ఞానాంబికదేవికి పుష్పాభిషేకం, నాల్గవ రోజు శివపార్వతుల కల్యాణం ఉంటుందని ఆలయ ప్రధాన కార్యదర్శి రుమాళ్ల శేఖర్ తెలిపారు. ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మల్లికార్జునస్వామి, అర్చకులు జగదీష్, అనిల్, శివ తదితరులు ఉన్నారు.

వాగుపై వంతెన నిర్మించండి



సింధనూర్ వద్ద వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

అయిజ: మండలంలోని సింధనూర్ వద్ద వాగుపై వంతెన నిర్మించక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి ఆయా గ్రామాల ప్రజలు రోడ్డుపై ప్రతిరోజు ప్రయాణం చేస్తుంటారు. వాగు ప్రదేశంలో వంతెన నిర్మించకుండా కొన్ని సంవత్సరాల క్రితం సీసీ బెడ్డు నిర్మాణం చేపట్టారు. వర్షాకాలంలో ఎరువులు, పురుగు మందులు కొనేందుకు ప్రతి రోజు రైతులు ఎద్దులబండ్లు, ఆటోల్లో ప్రయాణం చేయాల్సి ఉంటుంది. వాగులు వంకల నుంచి వచ్చిన వరుద నీరు వాగులో వేసిన సీసీ బెడ్డుపై ప్రవహించినంతసేపు ప్రయాణానికి ప్రతికూలత ఏర్పడుతోంది. దాని వల్ల ప్రజలు గమ్యాన్ని చేరుకునేందుకు వీలులేకుండా పోతోంది. సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతు చేయండి



శిథిలమైన ఎక్లాస్‌పురం బీటీ రోడ్డు

అయిజ: అయిజ నుంచి ఎక్లాస్‌పురానికి ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు శిథిలమై సంవత్సరాలు గడిచినా అధికారులు పట్టించుకోవడంలేదు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనాలపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి అనేకసార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రాణనష్టం జరగకముందే అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపై గుంతలు.. నిలిచిన వర్షపునీరు



చెన్నిపాడులో గుంతలలో నిలిచిన వర్షపునీరు

మానవపాడు: మండలంలోని గోకులపాడు, కలుకుంట్ల, చెన్నిపాడు, పెద్దపోతులపాడు రోడ్లపై వర్షపునీరు నిలిచి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతలతో నీరు నిండి వాహనదారులు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై గుంతలను పూడ్చి వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు చేయాలి

గద్వాల రూరల్: గద్వాలలో వ్యవసాయ పాలిటెక్నిక్, కృషి విజ్ఞాన కాలేజీని ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్ ఫోరం కన్వీనర్ మోహన్‌రావు కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం హైదరాబాదులో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీకి వినతిపత్రం అందజేశారు.

అనాథలకు పండ్ల పంపిణీ



ఎర్రవల్లిచౌరస్తా: మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, నందమూరి బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి సేవకులు సోమవారం బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం సన్నిధిలో అనాథలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సితార వెంకటేశ్వర్లు, గోవిందు నాయుడు, తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని శేరెల్లి వీధికి వెళ్లే దారిలో డ్రెయినేజీ కూలిపోయింది. రోడ్డు మధ్యలో డ్రెయినేజీపై గుంత ఏర్పడింది. రాత్రి సమయాల్లో గుంత కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగులందరు బాధ్యత వహించాలి



ఉండవెల్లి పాఠశాలలో పాఠ్యపుస్తకాలు ఉపాధ్యాయులకు పంపిణీ చేస్తున్న అధికారులు

అయిజ: ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టిపెట్టిందని, బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించేందుకు అన్ని శాఖల ఉద్యోగులు భాగస్వామ్యం వహించాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇన్‌చార్జి ఎంఈఓ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీడీఓ వెంకటయ్య, ఐకేపీ ఏపీఎం అన్నపూర్ణ, ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న హాజరయ్యారు. మొక్కుబడిగా కాకుండా విద్యార్థుల పూర్తి వివరాలు, చదివే పాఠశాలల పేర్లు ప్రొఫార్మాలో పొందపరుచాలని కలెక్టర్ ఆదేశాలున్నాయన్నారు. ఆ దిశగా ప్రతి అధికారి, సిబ్బంది పనిచేయాలని పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హాస్టల్ వార్డెన్‌లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బడిబాటపై ఎంపీపీ బీసమ్మ, ఎంపీడీఓ జబ్బార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శివప్రసాద్, వైస్ ఎంపీపీ దేవన్న, ఎంపీఓ పద్మావతి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఆస్మా, ఏపీఎం కోటేశ్వరి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: బడిబాట కార్యక్రమం ద్వారా బడీడు పిల్లలందరిని వందశాతం పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని ఎంఈఓ శివప్రసాద్, మండల ప్రత్యేక అధికారి గోవింద్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని బాడిబాట సమీక్ష కార్యక్రమానికి ఎంపీపీ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామపెద్దలు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు బడిబాట కార్యక్ర మం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీ ఓ ఆంజనేయరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆస్మా, ఏపీఎమ్ బీమన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజోళి: పిల్లలు బడి బయట కనిపించకూడదని, బడిబాట ద్వారా వారిని బడిలో చేర్పించాలని ఎంఈఓ నర్సింహులు అన్నారు. వడ్డేపల్లి పట్టణంలో రాజోళి, వడ్డేపల్లి మండలాల పాఠశాలల సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. బడి ప్రారంభించే రోజున పండుగ రోజును తలపించేలా బడిని గ్రామస్తులతో కలిసి ప్రారంభించాలన్నారు. పాఠ్య పుస్తకాలను కూడా నిర్దేశించిన సమయానికి అందించాలని సూచించారు.

అధికారులు భాగస్వాములు కావాలి

గట్టు: బడిబాటలో గ్రామ స్థాయి అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ చెన్నయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, హెడ్మాస్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరితా రాణి, ఏపీఎం సాంబశివుడు, వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులు, హెడ్మాస్టర్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నేడు బడిబాట కార్యక్రమంపై సమావేశం

శాంతినగర్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాల గురించి మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు వడ్డేపల్లి మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. ఈనెల 6 నుంచి 19 వరకు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా పురపాలక సంఘం కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, రిసోర్స్ పర్సన్లు, ప్రజలు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కేటీదొడ్డి: బడిబయట పిల్లలను బడిలో చేర్పించడం వల్ల వారికి విద్యాదానం చేసిన వాళ్లం అవుతామని ఎంపీడీఓ రాములు నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బడిబాటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంఈఓ సమక్షంలో ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్‌పర్సన్లకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ మనోరమ, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, హెచ్‌ఎంలు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ సూచించారు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఎస్‌ఎస్ ఆడిటోరియంలో ప్రధానోపాధ్యాయులకు బడిబాట కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజు, ఎంపీఓ భాస్కర్, పీఆర్‌ఏఈ పాండురంగారావు ఉన్నారు.



మానవపాడులో మాట్లాడుతున్న అధికారి



గట్టులో మాట్లాడుతున్న ఎంపీడీఓ చెన్నయ్య



అయిజలో మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతి